## పీజీ ప్రవేశ పరీక్షలు ఈసారీ ఆలస్యమేనా?

**ఉస్మానియా యూనివర్సిటీ:** వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సెట్లు విడుదల య్యాయి. కానీ పీజీ కోర్సుల ప్రవేశాల సీపీజీఈటీ మాత్రం ఈ ఏడాది కూడా ఆలస్యం చేస్తున్నారు. లాసెట్, పీజీలాసెట్, ఐసెట్, పీజీసెట్, ఎడ్‌సెట్, పీఈ సెట్ తదితర సెట్లను 2024–25 విద్యా సంవత్సరానికి విడుదల చేసి దరఖాస్తు, పరీక్షల నిర్వహణ తేదీలను ఖరారు చేశారు. కానీ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, ఓయూ సంయుక్తంగా నిర్వహించు కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ) గురించి ఇంత వరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయాలేదు. ప్రతి ఏటా సీపీగేట్ ప్రకటనలో ఆలస్యం కారణంగా ప్రవేశ పరీక్షలు, కౌన్సెలింగ్ ప్రవేశాల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగి పీజీ కోర్సుల తరగతుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. రాష్ట్రంలోని 8 వర్సిటీలకు ఒకే సారీ ప్రవేశ పరీక్షలు చేపట్టి మూడు విడత కౌన్సెలింగ్‌కు నాలుగు నెలల సమయం పడుతుంది. సుమారు లక్ష మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సీపీజీఈటీ–2024 తక్షణం విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

## దశలవారీగా హామీల అమలు



స్థానికులతో మాట్లాడుతున్న టీఎస్. శ్రీనివాస్

**రసూల్‌పురా:** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత దశల వారీగా నెరవేరుస్తున్నారని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎస్. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రసూల్‌పురా ఇందిరమ్మనగర్, ఛిల్లా గల్లీలో టీఎస్. శ్రీనివాస్ పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. ఇందిరమ్మ నగర్ నుంచి ఛిల్లా గల్లీ వరకు సీసీ రోడ్డు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే లాస్యనందిత నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.25 లక్షలు విడుదల చేశారని త్వరలో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటికే రసూల్‌పురాలోని వివిధ బస్తీల్లో నీటి ఎద్దడి నివారణకు రూ.20 లక్షల వ్యయంతో నాలుగు పవర్‌బోర్‌వెల్స్‌ను వేయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి శ్రీనివాస్, అజ్జు, వాహేబ్, సురేష్, ముబిన్, కిరణ్, సాయి. చిన్నా రవి, అఫ్రోజ్, మినాజ్, నజీర్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

**కంటోన్మెంట్:** 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' బీజేపీ విధానమని రామకృష్ణ అన్నారు. తన పదవీ కాలం మరో ఏడాది పాటు పొడిగించిన అనంతరం తొలిసారిగా ఆయన కంటోన్మెంట్‌లో పర్యటించారు. ఐదోవార్డు పరిధిలో రూ.5 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. స్థానికుల అభ్యర్థన మేరకు భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.ప్రధాని మోదీ స్ఫూర్తితో ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేస్తాడన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా తాను రెండేళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు, నర్సింగ్ రావు, రవి శంకర్, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

**8వ వార్డులో..**

**రసూల్‌పురా:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8వ వార్డుల్లో దశలవారీగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మూడో వార్డు వాహేబ్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ఆయన స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన మూడు నాలుగు ఐదు, ఎనిమిది వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు బీజేపీకి మూడోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, బీఎస్. శ్రీనివాస్, తేజిందర్ సింగ్, నరేష్ పర్మాని, దేవేందర్ శర్మ, లక్ష్మిప్రసాద్, సురేష్, దినేష్, మోహన్, వినోద, భాగ్యలక్ష్మి, రేఖ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## 'గృహజ్యోతి'కి ఇంటింటి సర్వే



వివరాలు నమోదు చేస్తున్న విద్యుత్ అధికారులు

**లాలాపేట:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి ఆదివారం తార్నాకలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అర్హులైన వారందరికి గృహజ్యోతి పథకం అందేలా విధులు నిర్వహిస్తున్నామని తమ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. విద్యుత్ కనెక్షన్ నెంబర్‌కు ఆధార్, రేషన్ కార్డును లింక్ చేసే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తార్నాక సెక్షన్ ఏఈ నారాయణ, ఫోర్‌మెన్ మల్లేష్, ఏరియా ఇన్‌చార్జి సందీప్‌రెడ్డి, బాబురావు, సతీష్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ వైస్ ప్రసిడెంట్ రాజనర్సింహ పాల్గొన్నారు.

## ఓయూకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్ర బడ్జెట్‌లో ఓయూకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య కోరారు. తాజా బడ్జెట్‌లో వర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లను కేటాయించారని కానీ అవి ఓయూ సిబ్బంది వేతనాలు పింఛన్లకు సరిపోవన్నారు. బడ్జెట్‌లో గత బీఆర్ఎస్ పాలకులు 6 శతాన్ని కేటాయిస్తే అధికారంలోకి వస్తే 15 శాతం కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 11.3 శాతాన్ని మాత్రమే కేటాయించారన్నారు. ఓయూలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సత్య డిమాండ్ చేశారు.

## సన్మానం



నారాయణగూడలోని భారత్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సమావేశంలో ఓయూ పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం–రూపాదేవి దంపతులను ఓయూ మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు, మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. కృష్ణారావు, భారత్ విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్ రెడ్డి, మిత్రబృందం ఘనంగా సన్మానించారు. –ఉస్మానియా యూనివర్సిటీ

# 40 ఏళ్లుగా ఫీట్ల రోడ్డే!

- ప్రతిపాదనలకే పరిమితమైన శాంతినగర్ రహదారి విస్తరణ
- ఇరుకైన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్
- విస్తరించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు, పాలకులు



ఇరుకైన రహదారితో స్తంభించిన ట్రాఫిక్



**లాలాపేట:** ప్రజా సమస్యల పరిష్కారం.. సౌకర్యాల కల్పనలో చొరవ చూపాల్సిన అధికారులు, నాయకులు వాటిని విస్మరిస్తుండటంతో ప్రజలకు నానా ఇక్కట్లకు గురి కావాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలోనే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఇష్టానుసారంగా హామీలు ఇచ్చిన అధికారులు ఆ తర్వాత వాటి గురించే పట్టించుకోకపోవడంతో సమస్యలతో సతమతమవుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా శాంతినగర్–లాలాగూడ రహదారి విస్తరణ కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేసి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు నేటికి దాని ఊసే ఎత్తడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రజల వద్దకు వచ్చే హామీలు గుప్పించిన నేతలు ఇప్పుడు శాంతినగర్, లాలాగూడ వైపు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు..**

శాంతినగర్, లాలాగూడ ప్రధాన రహదారి ప్రస్తుతం సుమారు 40 ఫీట్ల మేరకు ఉంది. గత 40 ఏళ్ల నుంచి పెరిగిన జనాభా, వాహనాల అవసరాలకు ఈ రోడ్డు ఏమాత్రం సరిపోవడం లేదు. నాటి నుంచి నేటి వరకు అదే రోడ్డులో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇరుకైన రహదారితో సరైన బస్ సౌకర్యం ఈ ప్రాంతానికి లేకుండా పోయింది. రోజులో రెండు మూడు ట్రిప్పులు సికింద్రాబాద్, మెట్టుగూడ, లాలాగూడ, శాంతినగర్, లాలాపేట మీదుగా మౌలాలి ప్రశాంత్‌నగర్ వరకు ఆర్టీసి బస్సులు ఈ రూట్‌లో రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సు లాంటి భారీ వాహనాలు వెళ్లే సమయంలో మరో వైపు ఇంకో వాహనం వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ఇక పాదచారులకు నడవడానికి అసలు ఫుట్‌పాత్ లేదు. దీంతో తరచుగా ఈ మార్గంలో వెళ్తున్న పాదచారులు ప్రమాదాల బారిన సైతం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏళ్ల తరబడి కానరాని అభివృద్ధి..**

హైదరాబాద్ నగరం నడిబొడ్డున సికింద్రాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న శాంతినగర్, లాలాగూడ ప్రాంతాలు దాదాపు అర్ధ శతాబ్దం గడుస్తున్నా నేటికి అభివృద్ధికి నోచుకోలేక పోయాయి. ఎక్కడ చూసినా ఇరుకైన రహదారులు, రోడ్లు ఉండటం వలన సరైన ట్రాన్స్‌పోర్టు లేక ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం లేదని స్థానికుల అభిప్రాయం. లాలాపేట ప్రధాన రహదారి విస్తరణతో పాటు శాంతినగర్, లాలాగూడ రహదారి విస్తరణ చేపడతామని ప్రకటించిన అధికారులు దీన్ని వదిలి పెట్టారు. లాలాపేట రోడ్డు విస్తరణ చేపట్టి దాదాపు ఎనిమిది ఏళ్లు కావస్తోందంటే అర్థం చేసుకోవచ్చు అధికారులు విధి నిర్వహణలో ఏమాత్రం చిత్తశుద్ధి కనబరుస్తున్నారో అని ప్రజలు విమర్శిస్తున్నారు.

**40 ఏళ్లుగా ఇదే రోడ్డు..**



రాష్ట్రాలు ఏర్పాటైనా.. ప్రభుత్వాలు మారినా శాంతినగర్ రూపురేఖలు మాత్రం మారలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. నా చిన్నతనం నుంచి 40 ఏళ్లకు పైగా ఇదే రోడ్డు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న శాంతినగర్ రహదారి విస్తరణ చేపట్టేందుకు అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాలి.

–ఎస్. బల్‌రామ్. స్థానిక నేత

**అధికారులు, పాలకులు స్పందించాలి..**



శాంతినగర్, లాలాగూడ, శేషా పహాడ్ తదితర ప్రాంతాల్లో దాదాపు అందరూ పేద మధ్య తరగతి ప్రజలే. సికింద్రాబాద్ నియోజకవర్గంలో నేతలకు పెద్ద ఓటు బ్యాంక్ ఉన్న ప్రాంతం. కానీ ప్రతి ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు ఓట్ల కోసం క్యూ కడుతున్న నేతలు ఈ ప్రాంత అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలి.

–ధర్మవీర్. శాంతినగర్ వాసి

## ఆకతాయిల ఆట కట్టించండి

**పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశం**



మహిళల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

**బన్సీలాల్‌పేట్:** ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆకతాయిల ఆట కట్టించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పోలీసులకు ఆదేశించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ మురికివాడలో ఆదివారం ఆయన పర్యటించారు. సీసీ నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ వాసులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వస్తున్నట్లు తెలుసుకున్న మహిళలందరూ ఒకే సారి వచ్చి రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు మద్యం, గంజాయి మత్తు పదార్థాలను సేవిస్తూ నానా హంగామా సృష్టిస్తున్నారని.. ఎవరైనా ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సాయంత్రం అయిందంటే అటుగా రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి రోడ్లపైనే వాహనాలను పార్కు చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో సీసీ నగర్ డబుల్ బెడ్రూమ్ ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని గస్తీని మరింత పెంచాలని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రవిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారు ఎంతటి వారైనా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, నాయకులు నర్సింగ్‌రావు(అచ్చి), ప్రేమ్, కుమార్ యాదవ్, లక్ష్మీపతి, అరుణ్‌గౌడ్, అబ్బాస్, సంపత్ పాల్గొన్నారు.

- బీజేపీ నాయకులు సురేష్, సీనియర్ జర్నలిస్టు బలరామ్, శ్రీనివాస్‌ను ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సురేష్ తల్లి రాజమణి ఇటీవల మరణించారు. సీసీ నగర్ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.19, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 21, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 50, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 57, మొరంగడ్డ 19, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## మహాధర్నాను విజయవంతం చేయాలి

**బన్సీలాల్‌పేట్:** ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా ఈ నెల 12న (నేడు) బీఎస్పీ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సనత్‌నగర్ నియోజకవర్గం బీఎస్పీ ఇన్‌చార్జి అఖిలేష్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ అంశంపై సోమవారం మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట మహాధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున బీఎస్పీ నిర్వహిస్తుందని ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ హాజరవుతారన్నారు.

## 'సామాజిక సేవలో రోటరీ క్లబ్ భాగస్వామ్యం'



విద్యార్థినులకు సైకిళ్ల అందజేసిన రోటరీ క్లబ్ సభ్యులు

**అమీర్‌పేట:** సామాజిక సేవలో రోటరీ క్లబ్ భాగస్వామ్యం వహిస్తోందని రోటరీ క్లబ్–3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు.రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ (ఆర్‌సీహెచ్ఎన్)ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం సైకిళ్ల పంపిణీ చేశారు.అమీర్‌పేట సిస్టర్ నివేదిత పాఠశాలలో ఆర్‌సీహెచ్ఎన్–వెల్నస్ ప్రాజెక్ట్ సమన్వయకర్త ఎం.హరిప్రసాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికా సాధికారిత సాధిస్తేనే భవిష్యత్ ప్రగతి సాధ్యమవుతుందని ఇదే ఉద్దేశంతో పేద కుటుంబాలకు చెందిన బాలికలు చదువుకునేందుకు అవసరమైన అన్ని అవకాశాలను కల్పించేందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే బాలికలకు సైకిళ్ల పంపిణీతో పాటు త్వరలో మరో రూ.25 లక్షలతో కుట్టు మెషిన్లు అందజేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీహెచ్ఎన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి మహాలక్ష్మి, మణికందన్, సభ్యులు జనార్ధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## కులం సర్టిఫికెట్ల జారీలో జాప్యం తగదు

**ఉస్మానియా యూనివర్సిటీ:** మండల కార్యాలయాల్లో ధ్రువపత్రాల జారీలో జాప్యం తగదని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి పేర్కొన్నారు. గురుకుల ఉద్యోగాలు, గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు కులం, ఆదాయం, నివాసం, ఇతర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే చిన్న చిన్న కారణాలు, పొరపాట్లను చూపిస్తూ తిరస్కరించడం బాధాకరమన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం గడువు సమీపిస్తుండటంతో నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. మీ సేవ దరఖాస్తులు కాకుండా పాత పద్ధతిలోనే కుల, ఆదాయ, నివాసం, ఇతర సర్టిఫికెట్లకు మండల కార్యాలయంలోనే నేరుగా దరఖాస్తు చేసే పద్ధతిని ప్రవేశ పెడితే దరఖాస్తుదారులు పొరపాట్లు వెంటనే అభ్యర్థులు తెలుసుకుంటారని కోరారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**లాలాపేట:** కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం గత పదేళ్లుగా 44 లేబర్ చట్టాలను తుంగలో తొక్కి, 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ అన్నారు. ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం లేబర్ అడ్డా వద్ద స్థానిక కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. సమ్మెలో భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని లేబర్ అడ్డాల వద్ద కనీస సౌకర్యాలు లేక అడ్డా కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టణ ఉపాధి హామీ కింద కార్మికుడికి కనీసం 200 రోజుల పని కల్పించాలనీ డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ కలిసి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, నర్సింహ, రహ్మతుల్లా, ఉపేందర్, విజయ్, కమల, వెంకటయ్య, ఎల్లయ్య, విజయ, అంజనేయులు, పోచయ్య, స్వామి, సోమేశ్, శ్రీను, మహమూద్, మల్లేష్ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి



**సనత్‌నగర్:** గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం.. బేగంపేట బాలంరాయి కమాన్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సదరు వృద్ధుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## 'కాంగ్రెస్ అన్ని హామీలను నెరవేరుస్తోంది'



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కోట నీలిమ

**సనత్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేశామని, త్వరలోనే మిగిలిన హామీలను కూడా పూర్తిచేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్‌కు చెందిన పలువురు మైనార్టీ నేతలు ఆదివారం ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం అక్కడ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేయలేని పనులను 10 వారాల్లోనే తాము పూర్తిచేసినట్లు చెప్పారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును గమనించి నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ షేక్ అక్బర్‌పాషా, అబ్దుల్ మొహిజ్, సయ్యద్ అహ్మద్, శేఖర్ పాల్గొన్నారు.

**నియామకపత్రం అందజేత..**

**అమీర్‌పేట:** అమీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్‌రావును నియమిస్తూ సికింద్రాబాద్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ ఇచ్చిన నియామక పత్రాన్ని ఆదివారం కోట నీలిమ శ్రీనివాస్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులకు అందేలా కృషి చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. గుడిగె శ్రీనివాస్‌యాదవ్, కటకం భాస్కర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చింతల్ బస్తీ వాసులు

**లాలాపేట:** తార్నాక చింతల్ బస్తీ వాసులు ఆదివారం బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా తుంగ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్నో ఉన్నతమైన విద్యలను అభ్యసించి ప్రపంచ మేధావిగా డా. బీఆర్ అంబేడ్కర్ గుర్తింపు పొందారన్నారు. తన జ్ఞానంతో ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారని కొనియాడారు. బహుజన వర్గాలందరూ ఆయన స్ఫూర్తితో ఉన్నత విద్యావంతులుగా తయారవ్వాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. నేటి యువత నిరంతరం స్ఫూర్తి పొందాలనే ఉద్దేశంతోనే గత కొంతకాలంగా ప్రతి ఆదివారం అంబేడ్కర్‌కు జ్ఞానమాల పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఉత్తమ న్యూస్ రీడర్‌గా గౌతమ్ కుమార్



గౌతమ్ కుమార్‌కు అవార్డును అందజేస్తున్న జస్టిస్ రామలింగేశ్వర రావు

**కంటోన్మెంట్:** కంటోన్మెంట్‌కు చెందిన దూరదర్శన్–యాదగిరి న్యూస్ రీడర్ గౌతమ్‌కుమార్‌కు ఉత్తమ న్యూస్ రీడర్ అవార్డు దక్కింది. ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు గౌతమ్ కుమార్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. తన ప్రతిభను గుర్తించి అవార్డు అందజేసిన ఆరాధన సాంస్కృతిక సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరాధన సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి లోకం కృష్ణ, డాక్టర్ వోలేటి పార్వతీశం, గంగోత్రి గోసంరక్షణ సమితి చైర్మన్ లయన్ జి. హనుమంతరావు, సెన్సార్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్ , ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (రి) లయన్ ఎం.ఏ. హమీద్, పి. మధుసుదన్ రావు, లయన్ డా చిల్లా రాజశేఖర్ రెడ్డి , లంక లక్ష్మినారాయణ, లయన్ పి.ఉమర్ ఖాన్, ఇనుగాల యుగేంధర్ రెడ్డి, శైలజ, ఇందిరా రెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని చేరదీసిన పోలీసులు



**అడ్డగుట్ట:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 8వ ప్లాట్ ఫామ్‌పై ఆరేళ్ల చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. గస్తీలో భాగంగా శనివారం అర్ధరాత్రి గుర్తించిన జీఆర్పీ పోలీసులు ఆ చిన్నారిని చేరదీయగా మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించి అమీర్‌పేటలోని శిశువిహార్‌కు తరలించారు.

## 14న జాతీయ ప్లీనరీ సమావేశాలు

**లిబర్టీ:** ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ ప్లీనరీ సమావేశాలు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్టు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్లీనరీ సమావేశాలు ప్రారంభమైతాయని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. తిరుపతిలో ఈ సమావేశాలు జరుగుతాయని, పార్లమెంటు ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో అరుణ రెడ్డి, నాగిళ్ల నవీన్‌కుమార్, నందికొండలరావు పాల్గొన్నారు.

## 'అన్ని కులాల జన గణన జరపాలి'

**పంజగుట్ట:** తెలంగాణలో ప్రతి వ్యక్తి కులగణన జరపాలని.. కేవలం బీసీల కుల గణన చేస్తే అందరికీ న్యాయం ఎలా జరుగుతుందని జస్టిస్ వి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కులాల సమగ్ర గణన డిమాండ్‌తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని కులాల వివరాలు బయటకు తీశారని తెలిపారు. అదే తరహాలో ఇక్కడ కూడా అన్ని కులాల గణన జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. అన్ని కులాల సమగ్ర గణన చెయ్యాలన్న విషయన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీ మేధావులు, న్యాయ నిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి చర్చించాలని కోరారు.